క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ఐ, సీఐఎఫ్‌టీల సందర్శన



ప్రయోగశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, తదితరులు

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్‌ఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) కేంద్రాలను కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ శనివారం సందర్శించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ఈ సంస్థల ప్రగతి, పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పరిశోధన అంశాలు, ప్రయోగశాలలు, సాంకేతిక పరిజ్ఞానంపై సాగే వినూత్న పరిశోధనలను అక్కడి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేపలు, చేప పిల్లల ఉత్పత్తి, లైవ్‌ఫీడ్ యూనిట్లను పరిశీలించారు. సముద్ర, మత్స్య సంబంధ రంగాల అభివృద్ధికి జరుగుతున్న పరిశోధనలు, సీఎంఎఫ్ఆర్‌ఐ కార్యకలాపాలను ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుదాస్ వివరించారు. సీఐఎఫ్‌టీ సేవలను డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీధర్ వివరించారు. మత్స్య రంగానికి ఉపయుక్తంగా నిలిచే వలలు, చేపల ఉత్పత్తులను వివరించారు. మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆరిలోవ : జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆరిలోవ ఎస్ఐ సీహెచ్ రాందాస్ తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై హనుమంతవాక నుంచి ఎండాడ వైపు వెళ్తున్న మార్గంలో సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి జూ పార్కు గేటు ఎదురుగా రోడ్డు ప్రమాదానికి గురై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అటుగా వెళ్లే వాహన చోదకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన బంధువులు ఎవరైనా ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ రాందాస్ కోరారు. ఆయన రోడ్డు దాటుతుండగానో, రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగానో హనుమంతవాక నుంచి ఎండాడ వైపు వెళ్తున్న ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన ఆటో



శ్రీకృష్ణాపురం వద్ద డివైడర్ పైకి దూసుకుపోయిన ఆటో

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ ఆటో డివైడర్‌పైకి దూసుకుపోయింది. ప్రయాణికులతో మితిమీరిన వేగంతో వస్తూ ఆ ఆటో అదుపు తప్పి పెద్ద ప్రమాదం నుంచి బయటపడింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... శనివారం సాయంత్రం సింహాచలం వైపు నుంచి ప్రయాణికులతో ఓ ఆటో హనుమంతవాక వైపు వస్తోంది. మితిమీరిన వేగంతో వస్తున్న ఆ ఆటో శ్రీకృష్ణాపురం వద్ద అదుపు తప్పి ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని డివైడర్‌పైకి దూసుకుపోయింది. దీంతో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను రోడ్డు పక్కకు జరిపించారు. గాయాలవడంతో ప్రయాణికులు చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు.

డాక్‌యార్డులో కొత్త అగ్నిమాపక కేంద్రం

సాక్షి, విశాఖపట్నం : భద్రతా వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు నేవల్ డాక్‌యార్డు నిరంతరం శ్రమిస్తుందని వైజాగ్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్(ఏఎస్‌డీ) రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ తెలిపారు. డాక్‌యార్డులో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న నూతన అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఏఎస్‌డీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కొత్త కేంద్రం అందుబాటులోకి వస్తే.. అత్యంత వేగంగా, మెరుగైన సౌకర్యాలతో అగ్నిమాపక బృందం సేవలు అందించేందుకు వీలవుతుందని రియర్ అడ్మిరల్ శ్రీనివాస్ వెల్లడించారు.

గ్రీన్ కవర్ ముసుగేసి... అక్రమ నిర్మాణాలు

- జోన్ – 2 పరిధి 9, 10, 11, 12, 13వ వార్డుల్లో జోరుగా అనధికారిక నిర్మాణాలు
- స్థానికుల ఫిర్యాదులతో చిన్నపాటి రంధ్రాలు చేసి వెళ్లిపోతున్న జీవీఎంసీ అధికారులు
- అనంతరం యథావిధిగా అక్రమ నిర్మాణాలు పూర్తి
- అధికారుల అండతో రెచ్చిపోతున్న బిల్డర్లు, నిర్మాణదారులు



జీవీఎంసీ తొమ్మిదో వార్డు వెటర్నరీ లే అవుట్‌లో అనధికారిక ఫ్లోర్‌కి చేసిన రంధ్రం

ఆరిలోవ : వడ్డించేవాడు మన వాడైతే.. ఎక్కడ కూర్చున్నా ఫర్వాలేదు అన్నది పాత సామెత. దీన్నే కొంచెం మార్చుకుని అధికారులు మనవారైతే ఎన్ని అక్రమ, అనధికారిక నిర్మాణాలు చేపట్టినా పర్వాలేదు అన్నట్లు రెచ్చిపోతున్నారు కొందరు బిల్డర్లు, నిర్మాణదారులు. జీవీఎంసీ అధికారుల అండ.. సూచనలతో గ్రీన్ కవర్ ముసుగేసేసి అనుమతుల్లేకుండా అనధికారికంగా భవనాలు నిర్మించుకుపోతున్నారు. ఇదీ జీవీఎంసీ జోన్ – 2 పరిధి 9, 10, 11, 12, 13వ వార్డుల్లోని పరిస్థితి. ఈ వార్డుల పరిధిలో అక్రమ కట్టడాలు, అనధికారిక నిర్మాణాలు స్వేచ్ఛగా సాగిపోతున్నాయి. నిర్మాణదారులు భవనాలు నిర్మించడానికి ముందుగా ప్లాన్ తీసుకుని... దాని ఆధారంగా అనధికారికంగా అదనపు శ్లాబులు వేసి సొమ్ము చేసుకొంటున్నారు. ఈ ప్రాంతంలో బిల్డర్లకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సహకారం అందించడంతో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగిపోతున్నాయి. ఇలాంటి అక్రమ నిర్మాణాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగడంతోపాటు జీవీఎంసీ ఆదాయానికి సైతం గండిపడుతోంది. బిల్డర్లకు అధికారులే సలహాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



11వ వార్డు కైలాసనగర్‌లో అనధికారిక ఫ్లోర్‌తో నిర్మిస్తున్న భవనం

చిన్న రంధ్రాలను చక్కగా కప్పేసి...

- జీవీఎంసీ 9వ వార్డు పరిధి జాతీయ రహదారిని అనుకుని హనుమంతవాక కూడలి ఎదురుగా వెటర్నరీ లే అవుట్‌లో ఓ భవన నిర్మాణదారుడు అనుమతులు దాటి అనధికారికంగా శ్లాబు వేసేశాడు. దానిపై ఫిర్యాదులు వెళ్లడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటీవల ఆ శ్లాబుకు బయటకు కనిపించే విధంగా చిన్న రంధ్రం చేసి వదిలేశారు. నిర్మాణదారుడు ప్రస్తుతం దాన్ని చక్కగా కప్పేసే ప్రయత్నంలో ఉన్నాడు.
- జీవీఎంసీ 9వ వార్డు పరిధి చలపతినగర్‌లో నాటకోళ్ల సంత రోడ్డు పక్కన ఓ భవన నిర్మాణంలో అనధికారిక ఫ్లోర్‌కు రోడ్డు వైపు అధికారులు రంధ్రం చేసి వదిలేశారు. ఆ రంధ్రాన్ని కూడా నిర్మాణదారుడు గ్రీన్ కవర్లు వేసి కప్పే ప్రయత్నం చేస్తున్నాడు.
- జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్‌లో వినాయక గుడిని అనుకుని ఓ భవన నిర్మాణదారుడు అనధికారిక ఫ్లోర్ వేసేశాడు. ఆ శ్లాబుకు ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు చిన్న రంధ్రం చేసి వదిలేశారు. ఇప్పుడు ఆ రంధ్రం ఉన్న శ్లాబుపై పెంట్‌హౌస్ కోసం గోడలు, పిల్లర్లు నిర్మించేశాడు. అప్పటికి వేసిన శ్లాబే అనధికారికం అనుకుంటే... దానిపై సగానికి పైగా పెంట్‌హౌస్ కూడా నిర్మించడానికి ప్రయత్నించడం విశేషం. ఈ నిర్మాణం సచివాలయం పక్కనే జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం మరో విశేషం.
- జీవీఎంసీ 11వ వార్డు పరిధి గాంధీనగర్ దరి కైలాసనగర్‌లో ఓ భవన నిర్మాణదారుడు అనధికారిక శ్లాబు వేసేశాడు. సుమారు 15 అడుగుల వెడల్పు గల ఇరుకు రోడ్డులో అనధికారిక ఫ్లోర్‌తో కలిసి ఐదు ఫ్లోర్లు నిర్మించడంతో ఫిర్యాదులు చేసినా సచివాలయం సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో ఎనిమిది అడుగుల వెడల్పు రోడ్డులో ఓ వ్యక్తి నాలుగు ఫ్లోర్లు నిర్మాణం చేపట్టేస్తున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పదో వార్డు వివేకానందనగర్‌లో వినాయక గుడి వెనుక రంధ్రం చేసిన అనధికారిక ఫ్లోర్‌పై పెంట్‌హౌస్ కోసం నిర్మించిన పిల్లర్లు, గోడలు



9వ వార్డు చలపతినగర్‌లో రంధ్రం చేసిన అనధికారిక ఫ్లోర్



11వ వార్డు బాలాజీనగర్‌లో అనధికారిక ఫ్లోర్‌తో నిర్మించిన భవనం

కథంతా గ్రీన్ కవర్ ముసుగులోనే..

అనధికారిక, అక్రమ నిర్మాణాలు చేపట్టే వారంతా గ్రీన్ కవర్ ముసుగులనే కథంతా నడిపించేస్తున్నారు. ముందుగా భవన నిర్మాణం కోసం బిల్డర్లు, నిర్మాణదారులు జీవీఎంసీకి రుసుము చెల్లించి ప్లాన్ తీసుకుంటున్నారు. అక్కడి నుంచి ఆ ప్లాన్ ఆధారంగా నిర్మాణం పూర్తి చేసేస్తున్నారు. ఆ తర్వాతే అసలు కథ గ్రీన్ కవర్ ముసుగులో నడిపించేస్తున్నారు. ప్లాన్ ఉన్నంతవరకు దర్జాగా చకచకా ఫ్లోర్లు నిర్మించేస్తున్నారు. ఆ తర్వాత గ్రీన్ కవర్ వేసి దానిలో అనధికారిక ఫ్లోర్ నిర్మిస్తున్నారు. దానిపై స్థానికులు ఫిర్యాదులు చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. ఆగమేఘాలపై ఆ భవనాల వద్దకు వెళ్లి చిన్న సైజులో శ్లాబుకు రోడ్డు వైపు కనిపించే విధంగా కారిడార్‌కు ఉపయోగించాల్సిన స్థలంలో తూతూమంత్రంగా రంధ్రం చేసి వెళ్లిపోతున్నారు. ఇక అంతే... అప్పటి నుంచి ఆ నిర్మాణం అధికారికంగా మారిపోతోంది. రంధ్రం పెట్టి మా పని మేం చేశాం.. మీ పని మీరు చేసుకుపోండి అన్నట్లు బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులను అక్కడితో అధికారులు వదిలేస్తున్నారు. దీంతో నిర్మాణదారులు కొద్ది రోజులపాటు ఆగి ఆ తర్వాత ఆ శ్లాబుకు పెట్టిన రంధ్రాలను మూసేసి దర్జాగా విక్రయాలకు పెట్టుకొంటున్నారు. అనధికారికంగా వేసిన శ్లాబును టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా తొలగించకుండా చిన్న రంధ్రం చేసి... ఫిర్యాదులపై మేం స్పందించామంటూ చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకు చిన్న సైజు రంధ్రాలే కావడంతో నిర్మాణదారులు మళ్లీ వాటిని సులువుగా కప్పేసి ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేసుకుపోతున్నారు.

యువత భవిష్యత్‌కు ఎన్‌ఈపీ - 2020 దిక్సూచి

నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ నిరూపరాణి



ఏయూ ప్రిన్సిపల్ నరసింహారావును సత్కరిస్తున్న నిరూపరాణి, తదితరులు

ఎంవీపీ కాలనీ : కేంద్రం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ - 2020 యువత భవిష్యత్‌కు దిక్సూచిగా నిలుస్తుందని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిరూపరాణి పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎమ్) ఆధ్వర్యంలో అకడమిక్ లీడర్‌షిప్ ఇన్ ఎన్‌ఈపీ - 2020 అంశంపై శనివారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నిరూపరాణి మాట్లాడుతూ దేశంలోని యువత భవిష్యత్ అవసరాలకు, నైపుణ్యాభివృద్ధికి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు ఒడిసిపట్టేందుకు అనుగుణంగా కేంద్రం కొత్త ఎడ్యుకేషనల్ పాలసీని అందుబాటులోకి తెచ్చిందన్నారు.

ఉన్నత విద్య సమగ్ర విధానాన్ని ఆవిష్కరించడంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనాత్మక నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంచడమే దీని లక్ష్యమన్నారు. ఈ విధానాన్ని విద్యాసంస్థలు పెద్ద ఎత్తున యువతకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ 21వ శతాబ్దపు సవాళ్లకు యువతను సన్నద్ధం చేయడంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నూతన విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఐఐఏఎం డైరెక్టర్ డాక్టర్ సుంకరి రవీంద్ర, ఐఐఏఎం డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణ మోహన్ తదితరులు ఎన్‌ఈపీ – 2020 విశిష్టతను, భవిష్యత్ మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ఆచార్య నిరూపరాణి అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య లలితా భాస్కరి, ఆచార్య బాలప్రసాద్, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెన్‌లో నాచు తొలగింపు



హనుమంతుని విగ్రహం వద్ద ఫౌంటెన్‌లో నాచు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆరిలోవ : జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో హనుమంతవాక కూడలిలో ఏర్పాటు చేసిన హనుమంతుని విగ్రహం వద్ద వాటర్ ఫౌంటెన్‌లో చేరిన నాచును జీవీఎంసీ తొమ్మిదో వార్డు పారిశుధ్య కార్మికులు శనివారం తొలిగించారు. ఇక్కడ రెండేళ్ల క్రితం అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనలతో జీవీఎంసీ అధికారులు ఎత్తైన హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాహనచోదకులకు కనువిందు చేసేలా విగ్రహంతోపాటు దాని చుట్టూ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ దట్టంగా నాచు పేరుకుపోయి దుర్వాసన రావడంతో వాహనచోదకులు సైతం ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో శనివారం పారిశుధ్య కార్మికులు ఆ నాచును తొలగించి నీటిని శుభ్రం చేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో శ్రద్ధ వహించండి

ఎంవీపీ పోలీసులకు సీపీ దిశానిర్దేశం



ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో సీపీ శంఖబ్రత బాగ్చీ

ఎంవీపీ కాలనీ : ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంవీపీ పోలీసులకు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దిశానిర్దేశం చేశారు. శనివారం ఉదయం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఫైల్స్ నిర్వహిస్తున్న తీరును పర్యవేక్షించారు. రికార్డులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఎంవీపీ కాలనీ నుంచి ఎక్కువగా కమిషనరేట్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని... ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. ఇటీవల కొన్ని కేసుల్లో ప్రధాన నిందితులను అరెస్ట్ చేయడంలో ఎంవీపీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాటిపైనా సీపీ ఆరా తీసినట్లు తెలిసింది. నోటీస్ బోర్డులో ఉంచిన నేరస్తుల ఫొటోలు క్లియర్‌గా కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించిన సీపీ స్టేషన్ పనితీరుపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోనని పేర్కొనట్లు తెలిసింది. కార్యక్రమంలో ఎంవీపీ సీఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాకారం కావాలి



దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : మహిళలను గౌరవించడంపై యువతరానికి అవగాహన కల్పించడం, ఆ దిశగా వారిని చైతన్యపరచడం ఎంతో అవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీ.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్వర్క్ సంయుక్తంగా వుమెన్ ఎట్ వర్క్ ప్లేస్ పాలిసీస్‌పై శనివారం నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ముందుగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి ఆచార్య జీ.పి.రాజశేఖర్ పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇది కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపితే సత్ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు సంబంధించిన విధాన నిర్ణయాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన జరపాల్సిన అవసరముందన్నారు. కార్పొరేట్ సంస్థల్లో మహిళలకు కొంత మెరుగైన పరిస్థితులు, వసతులు లభిస్తున్నాయని... ఈ తరహాలో ప్రభుత్వ సంస్థల్లో సైతం అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.

అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ రాజ్యాంగం మహిళల రక్షణకు, సమాజంలో సమ్మిళితం చేయడానికి కల్పించిన ప్రాధాన్యతలను వివరించారు. విద్యా అవకాశాలు మెరుగవడం, ఆర్థిక సంస్కరణల ఫలితంగా మహిళలు విభిన్న రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. మహిళలు తమ మానసిక ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలకు ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్ స్టడీస్ సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ ఏయూలో విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. అనంతరం ఏయూ తరపున ఇండియన్ వుమెన్ నెట్వర్క్ ప్రతినిధులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఇండియన్ వుమెన్ నెట్వర్క్ ఆంధ్రప్రదేశ్ శాఖ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఉష, డాక్టర్ టి.వసుధ, సంస్థ కో లీడ్, సైకాలజిస్ట్ జి.శ్రీనిజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఉన్నత చదువుకు రూ.లక్ష సాయం



తల్లిదండ్రుల సమక్షంలో భవ్యశ్రీకి లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న దాతలు

ఎంవీపీ కాలనీ : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వాకాడ భవ్యశ్రీ అనే విద్యార్థినికి 17వ వార్డుకు చెందిన ఎంఎల్ రెడ్డి, కర్రి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. 17వ వార్డు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్ రెడ్డి, కర్రి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు మద్ది శ్రీనివాసరెడ్డి, తనూజ, మద్ది అప్పలరెడ్డి, ప్రవీణ్, పద్మజ, మాధవి రూ.లక్ష చెక్కును భవ్యశ్రీకి ఆమె తల్లిదండ్రులు వాకడ శివప్రసాద్, సునీత సమక్షంలో శనివారం అందజేశారు. భవ్యశ్రీ ఉన్నత చదువుకు ఈ ఆర్థిక సాయాన్ని వినియోగించాలని కోరారు. వచ్చే ఏడాది నుంచి 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బచ్చు తవిటిరెడ్డి, మరడ శ్రీనివాస్‌రెడ్డి, వాకాడ బాపిరెడ్డి, ఎల్లయ్యరెడ్డి, పోతన్నరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ లా కళాశాలలో స్వచ్ఛభారత్

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాలలో శనివారం స్వచ్ఛ భారత్ అభియాన్‌ను చాలా ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల సహాయక సిబ్బంది చురుగ్గా పాల్గొని చెత్త తొలగించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతా మాణిక్యం ప్రసంగించారు. స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న వారందరితో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌పై శిక్షణ



శిక్షణలో బోధిస్తున్న చంద్రశేఖర్

ఆరిలోవ : ప్రస్తుత కాలంలో ఇంగ్లిష్ కమ్యూనికేషన్ ఓ ఆయుధం లాంటిదని విద్య ఇంగ్లిష్ అకాడమీ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురుకులాల జిల్లా ఇన్‌చార్జి సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ సూచనలతో శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలోని ఉపాధ్యాయులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శనివారం శిక్షణను ప్రిన్సిపాల్ రత్నవల్లి నిర్వహించారు. ఈ శిక్షణలో చంద్రశేఖర్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్స్‌పై ఉపాధ్యాయులకు వివరించారు. బెటర్ కమ్యూనికేషన్ బెటర్ లైఫ్‌ను ఇస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఆంగ్లంపై పట్టు పెంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ జెట్టీ ఉపాధ్యాయులకు పలు సైకాలజీ అంశాలు వివరించారు. విద్యార్థులు, సమాజంలో ఇతరుల మనస్తత్వాలను తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలు నిర్వీర్యం

సీతంపేట: ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టాలు రోజురోజుకూ నిర్వీర్యమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా ఐదో మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. పోరాటాలతోనే ఎస్టీ, ఎస్సీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దానితోపాటు ఇప్పుడున్న చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఎంతో మంది ఎస్సీలు, ఎస్టీలు ఎలాంటి విచారణ, బెయిల్ లేకుండా జైళ్లలో మగ్గుతున్నారన్నారు. సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వారు దేశాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకికవాదం, సామ్యవాదానికి బి.ఆర్.అంబేడ్కర్ పెద్దపీట వేశారని, ఆ రెండింటినీ తొలగించే కుట్ర నేడు జరుగుతోందన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాట్లాడుతున్నారని.. అందుకే ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నా స్పందించడం లేదన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వి.ప్రభాకర్, కె.సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వర రావు తెలిపారు. ఇందుకోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయసు గల వారికి మూడు నెలల పాటు సర్టిఫికెట్ ఆధారిత శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ బలివాడ సౌజన్యను 90147 66143 నంబరులో సంప్రదించవచ్చు.